


(ప్రారంభం)

**మధు పూర్తిపేరు మధుబాల**. ఆమె తండ్రి పాత హిందీ చలనచిత్రాల కథానాయిక మధుబాలకి వీరాభిమాని. కొంచెం పెద్దయ్యాక మధు తండ్రిని ఏడిపించేది. 'నీకు మధుబాల అసలుపేరు ముంతాజ్ తెలుసా'అని. మాధవరావు – ఆమె తండ్రి "ఆ పేరుతో ఇంకో నటివుంది కదా "అని సమర్థించుకునేవాడు.

"జోకులొద్దు నాన్నా! నీ మధుబాల ఇప్పటి ముంతాజ్ కి ముందు తరం కథానాయిక. "

"అదంతా నాకు తెలీదే మధూ! ముంతాజ్ నీ, ముంతాజ్ జహా బేగంనీ (అది మధుబాల పూర్తిపేరు /అసలుపేరు ) నేను ఎరుగను. నాకు తెలిసింది మధుబాల ఒక్కతే" అంటూ ఆమె పాత చిత్రంలోని పాట పాడుకుంటూ అక్కడినుండి వెళ్లిపోయేవాడు.

మధూ, ఆమె భర్త కృష్ణ మోహన్ ఇప్పుడు డెభ్భైయవపడిలో పడ్డారు. మేనత్త,మేనమామ పిల్లలు. మాధవరావు చెల్లెలు సుభద్ర కొడుకు కృష్ణ.రెండు కుటుంబాలు కలిసే ఉండేవి. అందువల్ల కలిసే పెరిగారు. మధు పుట్టినపుడు 'నీకు భార్య పుట్టిందిరోయ్' అన్ని అందరూ అంటే రెండేళ్ల కృష్ణకి ఏమీఅర్థంకాలేదు. కానీ, తనుఆడుకోవటానికి ఇంకో బొమ్మ దొరికిందని సంతోషపడ్డాడు. వాడెప్పుడూ సరిగా చదవకపోవటంవల్ల ఇద్దరూ ఒకేక్లాసు చదువుతుండేవాళ్లు. కృష్ణ మధునెప్పుడూ వేరే ఐడెంటిటీగా చూడలేదు. తెలిసి కాదు. అది అంతే. ఆంగ్లంలో చెప్పాలంటే హి టుక్ హర్ ఫర్ గ్రాంటెడ్ ఇన్ ఎవ్విరి యాస్పెక్ట్ అండ్ ఆల్వేస్.

చిన్నపుడు చదువులో వెనకపడి మధు క్లాసేచదివిన కృష్ణ ప్రీయూనివర్సిటీ కి వచ్చాక గమ్మత్తుగా చాలా కష్టపడి చదివి మెడికల్ కాలేజ్ లో చేరిపోయాడు. తెలివికలది అనుకున్న మధు సాధారణమైన మార్కులతో ప్యాసయి–అందునిమిత్తం ఏమాత్రం బాధపడకుండా బియ్యేలో చేరిపోయింది. కేశవరావు–కృష్ణ తండ్రి కొడుకు ఏడొనేషన్ లేకుండా

మెడికల్ సీటు తెచ్చుకున్నందుకు ఒక రాజదూత్ మోటార్ సైకిల్ కొనిచ్చాడు. కృష్ణ ఆమెను ఏ సీ కాలేజ్ లో దింపి తను మెడికల్ కాలేజ్ కి వెళ్ళేవాడు.

మధు తెలివికలది. కానీ బద్ధకస్తురాలు. కృష్ణకి తెలివి, కష్టపడేతత్త్వం రెండూ ఉన్నాయి. ఎనాటమి క్లాసుజరుగుతున్నప్పుడు మొదటిసారి అతనికి మధు స్త్రీ అని స్పృహ కలిగింది. దానిలో మోహము,వ్యామోహము,ప్రేమాఏమీలేవు. మధుస్త్రీ, తానుపురుషుడు అనే విషయం మొదటిసారి తట్టింది. అతను ఎప్పుడూ ఏ స్త్రీ పట్ల ఆకర్షితుడు కాలేదు అని కాదు. క్లినికల్స్ అప్పుడు భారతి – అతనిక్లాసే – ఇద్దరికీ కలిపి డ్యూటీ కావటం వల్ల – ఇద్దరికి ఏ వ్యాపకమూ లేకపోవటం వల్ల, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను అప్పటికే నమ్మటం మానేయటం వల్ల, ఇద్దరిదీ ఎక్కువ మాట్లాడే స్వభావం కావటం వల్ల చాలా కబుర్లు చెప్పుకునేవాళ్ళు.

వైద్య విద్యార్థులతో ఇబ్బంది ఏమిటంటే వాళ్ళు తమ ముందు ఉన్న మానవశరీరాలను తాము చదువుతున్న పుస్తకాల్లాగే చూస్తారు. అయితే అవి మానవశరీరాలు కావటం వల్ల వీళ్ళు వేసుకునే జోకులు ఇతరులకి ఒక్కొక్కసారి చాలా ఇబ్బందికరంగాను,చాలాసార్లు ఎబ్బెట్టుగాను, శృతిమించినవిగానూ అనిపిస్తాయి. వీళ్ళు తమ ఉపాధ్యాయుల మీద జోకులు వేసుకున్నట్టుగానే శవాలమీద వేసుకుంటారు. ఉదాహరణకి పెరిటోనియం గురించి చదువుతుంటే స్త్రీల మర్మావయం ఫోర్సెప్స్ కింద కొంత వదులుగా తగిలితే 'బాగా బిజీ మనిషి అయివుండాలి. ఇప్పుడు ఆ పురుషులందరినీ విరహానికి వదిలేసి మనని వలచి వచ్చింది.' అటువంటివి.

ఒక స్త్రీ వైద్య నిపుణుడు ఒకసారి రైలులో ప్రయాణం చేస్తున్నాడు. కొంచెం వయసు మళ్ళిన వాడయినప్పటికీ, పురుషుడయిన పాపానికి అతనికి పై బెర్త్ కేటాయించారు దయగల రైల్వే అధికారులు. అతని ఎదురుగా ఉన్న మహిళకు క్రింది బెర్త్ కేటాయించారు. ఆయన పైకి సులువుగా ఎలా ఎక్కడమా అని ఆలోచిస్తుంటే ఎదుటి సీటు స్త్రీ ఆయన కంటే బాగా చిన్నది "మీరు కింద పడుకోండి డాక్టర్ గారూ! నేను పైన పడుకుంటాను " అంది. మగబుద్ధి కావటం వల్ల ఆయనకి తన మెడికల్ కాలేజీ జోకు గుర్తుకు వచ్చి, సంస్కారవంతుడుకూడా కావటంతో "నేను డాక్టర్నని తెలుసా అమ్మా మీకు? అని అడిగాడు. ఆమె మనస్ఫూర్తిగా నవ్వి తన మూడు సంవత్సరాల కొడుకుని ముందుకు తోసి "వీడు మీ దయే డాక్టర్ గారు"అంది. మళ్ళీ పూర్వ విద్యార్థి జీవితం గుర్తుకు వచ్చి పరమచెత్తజోకు గుర్తుకు వచ్చింది. అది 'నేను గైనకొలెజిస్టని.నాకు మనుషుల ముఖాలు గుర్తుండవు.' (ఈ జోకు నాకు అత్యంత అభిమానరచయిత, వైద్యులు అయిన కీర్తిశేషులు డాక్టర్ కేశవరెడ్డిగారిది) ఆమెతో " గుర్తు లేదమ్మా! థాంక్స్ " అన్నాడు. అవతలి వ్యక్తి పాపం ఎంతమందినని గుర్తుపెట్టుకుంటారు అనుకుంది అమాయకంగా.

ఇంతకీ మళ్ళీ వెనక్కివెళ్లి చెప్పొచ్చేదేమంటే చీమ చిటుక్కుమన్నా ఆ విషయాన్ని మధుతో పంచుకునే అలవాటున్న కృష్ణ ఇవాళ్టి ఈ హాస్యపుగుళికను కూడా ఆమెకు వినిపించాడు. అతనితో చదువుకుంటున్న సహాధ్యాయులంతా – స్త్రీలతో సహా పగలబడి నవ్విన ఆ జోక్ ని మధు అస్సలు రెలిష్ చేయలేదు. “ ఎంత శవమయినా అలా ఎలా మాట్లాడతారు? ” అంది. అటువంటి రెండు మూడు సందర్భాల తర్వాత “చూడూ! నీ వైద్యవిద్యకీ, నీకు ఒకనమస్కారం.ఇలాంటి చెత్త మాటలు మాట్లాడావంటే చెప్పుచ్చుకుని కొడతాను” అంది. బహుశా సృష్టి స్త్రీకి ఇచ్చిన వరం ఇదే అయ్యుంటుంది. వ్యక్తురాలు అయినప్పటినుంచీ తననుతానుకాపాడుకోవటం, పురుషుడు హద్దు దాటినా అతన్ని నివారించటం, – ఇందులో మినహాయింపులు ఉండవచ్చు – ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లో.

తరవాత కృష్ణ ఎప్పుడూ మధుతో అటువంటి మాటలు మాటలాడలేదు. అయితే ఆమెపట్ల అతని దృక్పథం లో కొంత మార్పు వచ్చింది. దొంగతనంగా ఆమె శరీరాన్ని పరీక్షగా చూసేవాడు. మధు కూడా చిన్నప్పటిలా మీదపడి మాట్లాడటం తగ్గించింది. ఇద్దరి తలితండ్రులు ఎప్పుడూ వాళ్ళమీద ఏ ఆంక్షా పెట్టిందిలేదు. ఆమె తనకు తానే హద్దులు గీసుకుని అతన్ని ఆ హద్దుల అవతల నిలబెట్టింది. చామనఛాయగా ఉండే మధు చక్కని ఆరోగ్యంతో, కళఅయిన ముఖంతో, తల్లినుండి వారసత్వంగా తెచ్చుకున్న పొందికయిన అవయవసంపదతో రెడ్డిగారి మాయాబజార్ చిత్రంలో శశిరేఖలా ఉండేది.

కృష్ణ 3వ సంవత్సరంలో ఉండగానే ఆమెకి డిగ్రీ పూర్తయిపోయింది. “ ఏం చేద్దాం మధూ! ” అని అడిగారు ఇద్దరి తలితండ్రులు.

“బావకింకా రెండు సంవత్సరాల చదువుంది నాన్నా! మనం తనని డిస్టర్బ్ చేయొద్దు” అంది మధు. వాళ్లంతా ఆమె ఎమ్మే లో చేరుతుందనుకుంటే ఆమె నేను లా చదువుతాను అంది. ఎప్పుడయితే చదువులు వేరయ్యాయో పరిస్థితులు కూడా మారాయి. డిగ్రీ తర్వాత న్యాయవిద్య మూడు సంవత్సరాలు. అతను హౌస్ సర్జన్సీకి వచ్చేసరికి ఆమె ఆఖరి సంవత్సరం ఆఖరి సెమిస్టర్ కి వచ్చింది. కేశవరావుకి కొడుకు పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలని కోరిక కలిగింది. పెళ్లి చేసుకుని చదవాలని కృష్ణకి అనిపించినా ఆమాట ఎవరూ అనకపోవటంవల్ల అతను ఆ పరీక్షకు తయారైయి ఎయిమ్స్ లో కార్డియోలజీ విభాగంలో సీటు తెచ్చుకుని ఢిల్లీ వెళ్ళిపోయాడు.

కృష్ణ చదువు అయ్యేటప్పటికీ మధు చదువు కూడా అయిపోయింది. వెంటనే ఆమె బాగా పేరున్న వకీలు దగ్గర జూనియర్ గా చేరిపోయింది. ఆరునెలలు గడిచేటప్పటికీ ఆసీనియర్ కి అర్ధం అయిపోయింది. ఆయన మధుతో,

"మధుబాలా! నువ్వు తెలివిగలదానివి. నా వెనుక ఫైల్స్ మోయటమూ, వాయిదాలు అడగటమూ నాకూ,నీకూ,న్యాయవిద్యకూ కూడా అవమానం.సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకో! అవసరమయితే నా సహాయం ఎప్పుడూ ఉంటుంది. " అన్నాడు.

మాధవరావు "వద్దు.కృష్ణ వచ్చేస్తాడు"అని చెప్పినా వినకుండా మధు ఇంటిముందు బోర్డు కట్టేసింది. తండ్రి, మేనమామ "ఏరా! ఇంకా పెళ్లి ఏర్పాట్లు చెయ్యొచ్చా? " అని అడిగితే కృష్ణ ఏ మాత్రం మొహమాట పడకుండా కళ్ళెగరేసి "ఓ! ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా. " అన్నాడు. పెద్దవాళ్లంతా పగలబడి నవ్వి మధువంక చూస్తే,

ఆమె "నేను రెండు రోజుల్లో చెప్తా నాన్నా. " అంది.

ఇంటిల్లపాదీ కృష్ణతో సహా ఆశ్చర్యపోయారు.

మరురోజు పొద్దున అతను నిద్రలేచేసరికి మధు బయటకు వెళ్లేందుకు తయారైయి కూర్చుంది. "ఎక్కడికే బయలుదేరావు పొద్దున్నే. " అని అడిగాడు బ్రష్షు నోట్లోపెట్టుకునే.

"ముందు నువ్వు ఆ దంత ధావన కార్యక్రమమేదో స్నానాలగదిలో తగలడు. బయలుదేరావు కాదు. బయలుదేరతాం ఇద్దరమూ. విజయవాడలో కొంచెం పనుంది." ఇద్దరూ ఉపాహారం పూర్తి చేసుకుని విజయవాడ బయలు దేరారు. వాళ్ళిద్దరినీ ఎవ్వరూ ఎప్పుడూ కట్టడి చేయలేదు. విజయవాడ వెళ్లి అమ్మవారిని దర్శించుకుని, ఉదయం ఆట సినిమా కి వెళ్లారు. హోటల్ లో భోజనం చేశా రు.

"ఏమిటి మధూ! దీనికోసమా ఇంత దూరం వచ్చాము? నువ్వేదో నీ ప్రేమ్ కహాని చెపుతావనుకున్నా."

"నాకేమీ ప్రేమకథలు లేవు బావా! నా వెనుక ఎవరూ పడలేదని కాదు. కొందరు నిజంగానే ప్రేమించి ఉండవచ్చు కూడా. నేను నిన్ను తప్ప ఎవరినీ నా దారిదాపుల్లోకి కానీ, నా మనసులోకి కానీ రానివ్వలేదు. సరిగ్గా చెప్పాలంటే దరిదాపుల్లోకి ఎవరినీ రానివ్వలేదు. మనసులోకి ఎవ్వరూ రాలేదు".

కృష్ణ 'మరి'? అని అడగబోయాడు. ఆమె ఉన్న మానసిక స్థితి ని చూసి 'మాట్లాడనీ ' అని ఊరుకున్నాడు.

" నాకు వంట వచ్చు. ఉమ్మడి కుటుంబం లో పెరగటం వల్ల పనీపాట, ఇల్లు చక్కబెట్టుకోవటం ఒక ఆడపిల్లకు ఏమేమి రావాలో అన్నీ వచ్చు. కానీ నీతో ఎలావుండగలనో తెలియటం లేదు." కొంచెం సిగ్గుగా తలవంచుకుంది.

ముందు కృష్ణ కి ఏమీ అర్థం కాలేదు. తర్వాత ఆమె ఎర్రబడిన చెక్కిళ్లు, సిగ్గు చూసి అర్థం చేసుకున్నాడు. దగ్గరకు తీసుకోబోయాడు. ఇది వరకు నిస్సకోచంగా అతన్ని కౌగిలించుకునే మధు కొంచెం దూరం జరిగింది. అతను ఆమె

చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని చాలా మృదువుగా "నాకు అర్థం అయ్యిందిలే! ఇదొొక్కటేనా నీ అనుమానం? " అని అడిగాడు.

" అవును బావా! మాకు లా చదువులో లో కాంట్రాక్ట్స్ అనే సబ్జెక్టు లో, టాసిట్ అండర్స్టాండింగ్ అని ఉంటుంది. అంటే ఆ టర్మ్స్ అండ్ కండిషన్స్ చెప్పక్కర్లేదు. కానీ అవి ముఖ్యం అని దాని అర్థం. పెళ్ళికి అది చాలా అవసరం కదా బావా! "

"అవునుమధూ! అవసరం. కానీ ఇదొొక్కటే ముఖ్యంకాదు. స్నేహం, ప్రేమ కూడా ముఖ్యమే. నిజానికి అవే ఎక్కువ ముఖ్యం. మధూ! నువ్వంటే నాకూ ప్రాణమే! నువ్వు నాదానివే అనే నమ్మకం తో ఈ ఇరవై అయిదు సంవత్సరాలు బతికేశాను. నిన్ను నేను టేకెన్ ఫర్ గ్రాంటెడ్ గా తీసుకున్నాను. నువ్వు నాకెంత ముఖ్యమో ఎప్పుడు చెప్పలేదు. అది నాకు నేను చెప్పుకోవటమే అనుకున్నాను. "

"నువ్వు ఎవరినీ ఈ విధం గా కోరుకోలేదా బావా? "

"మగవాడి బుద్ధి కుక్క బుద్ధి మధూ! చాలామందిని శారీరకంగా కోరుకున్నాను.అయితే నేనెప్పుడూ వాళ్ళని తాకనైనా తాకలేదు. ఇక్కడ మెడికల్ కాలేజ్ లో ఉండగా మరీను. అవన్నీ పాసింగ్ క్లౌడ్స్. ఢిల్లీ వెళ్లేముందు నిన్ను పెళ్లి చేసుకుని వెంట తీసుకువెళ్లాలని ఉండేది. సిగ్గులేకుండా చెపుతాను. కోరికతో ఊగిపోయేవాడిని. ఇంట్లో ఒప్పుకోలేదు. నువ్వా లా చదువుతున్నావు. నీ ముందు ఈ రోజు మనసు విప్పనీ! ఢిల్లీ ఎయిమ్స్ లో మాత్రం కొంత పట్టుతప్పాను. అనురాగ్ పటేల్ అనే అమ్మాయికి హుక్ అయ్యాను. దూడ ప్రేమ అంటారు చూడు – అలాంటిది అనమాట. పొద్దున్న లేచిన దగ్గర్నుండీ ఆపిల్ల ధ్యాసే! ఆ అమ్మాయి చాలాకాలం నన్ను పట్టించుకోలేదు. తర్వాత ఎలాగో పడిపోయింది. చాలా మంచి (?) స్నేహితులమయ్యాం. నిద్రపోవటానికి మా క్వార్టర్స్ కి వెళ్ళినపుడు తప్ప ఇద్దరమూ కలిసే ఉండేవాళ్ళం. నైట్ డ్యూటీ అయితే ఇక పండగే."

"ఇంతేనా? " ఇంతసేపటికి మధు నోరు విప్పింది.

"లేదు మధూ! వాచాలత్వం వల్ల కొంత, వృత్తిరీత్యా కొంత మాటల్లో చాలా కట్టుతప్పాం. మామూలుగా ప్రేమికులు, భార్యభర్తలుతప్ప మాట్లాడకూడని మాటలన్నీ మాట్లాడుకున్నాం. ఒకసారి ఆ అమ్మాయి క్వార్టర్స్ కి వెళ్లాను. దాదాపు శృంగారం మొదలుపెట్టే సమయానికి నీ ముఖం ఒకఫ్లాష్ లా నా కళ్ళ ముందుకు వచ్చింది. అంతే! అన్ని నెలలుగా నన్ను కమ్మిన వ్యామోహం ఒక్క క్షణంలో దిగిపోయింది. ఒక్క ఉదుటున లేచాను. శరీరం రమించకపోవచ్చు. కానీ మనసు చలించింది మధూ! ఆ క్షణాన చలించటం కాదు– చలిస్తూనే ఉంది గత కొద్దీ నెలలుగా. నాకు ఉష్ణం వచ్చేసింది. రెండురోజులు శలవు పెట్టి – తిండీ, నిద్ర మానేసి గదిలో పడి ఉన్నాను. ఒకసారి గుంటూరు వచ్చి నీ ఒడిలో

తలపెట్టుకుని ఏడవాలనిపించింది. కనీసం ఒక పెద్ద ఉత్తరమయినా రాయాలన్పించింది . తర్వాత ఆ అధ్యాయానికి తెర దింపేశాను.“

“మరి ఆ అమ్మాయి?”

“తెలీదు మధూ! నేను డ్యూటీ మార్పించేసుకున్నాను.”

“మరెప్పుడూ కలవలేదా బావా? ”

“”కలిసింది మధూ! ఒకసారి అనుకోకుండా ఎదురు పడ్డాం – చాలా దగ్గరగా. “

‘‘మరి?’ అన్నట్టు చూసింది. ”

“కాండ్రించి ఊసింది మధూ! నా ముఖాన కాదులే –పక్కన. కానీ నాకయితే నా ముఖాన ఊసినట్టే అనిపించింది. అప్రయత్నంగా ముఖం తుడుచుకున్నాను కూడా. తర్వాత ఆలోచిస్తే ఆమె తప్పు ఏమీ లేదని అనిపించింది. మోహమను, వ్యామోహం అను, చిత్త చాంచల్యం అను, ప్రేమ అను ఒక వయసులో ఆపోజిట్ జెండర్ మీద మక్కువ కలుగుతుంది. రచయితలు ఏదో చెపుతారుగానీ వీటి మధ్య తేడా అప్పుడు మనకు తెలియదు. ఆలోచనకి ఇక్కడ తావులేదు. అదొక ప్రభంజనం. మనం కొట్టుకుపోతాం తప్ప కూర్చుని మేధతో ఆలోచించం. అవతలి వ్యక్తి పట్ల ఆకర్షణ చాలా తాత్కాలికం. దానికి లోబడితే ఆ బంధం ఒక బ్యాగేజీ తో వస్తుంది. సంస్కృతి పరమయిన తేడాలు, కుటుంబపరమైన తేడాలు, అలవాట్లు, ఆహార సంబంధం అయిన వాటితో సహా. శారీరకంగా కమిట్ అయ్యాంకదా అని వివాహ బంధంలో చిక్కుకుంటే తర్వాత ఎన్నో సంకెళ్లు.“

”అంటే? ”

“మీ అమ్మనాకూ అత్త అవుతుంది. నేను అలాగే పిలుస్తాను కూడా. అయితే నా మనసులో మీ అమ్మకు, మాఅమ్మకు తేడా లేదు. అదే చనువుతో ఆమె చేతి అన్నం తింటాను. తిన్నాక కడుక్కున్న చెయ్యి ఆమె కొంగుతో తుడుచుకుంటాను. ఆమె తొడని దిండు చేసుకుని ఎన్ని మధ్యాహ్నాలు నిద్రపోయానో. ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే! అత్త రోటిలో గోంగూర పచ్చడి నూరి పిల్లలందరినీ పిలిస్తే అన్నంగిన్నెతో చుట్టూ చేరి ఆమె చేతి ముద్దలు తినేవాళ్ళం. ఆ ఇల్లు, ఆ మనుషులు, ఆఅనుభూతులు ఎన్ని జన్మలెత్తితే నాకు దొరుకుతాయి మధూ? అవన్నీ ఒకెత్తు. నిన్ను వదులుకోవటం అంటే నన్ను నేను వదులుకోవటమే. నువ్వు ఇప్పటికే ఎవరినైయినా ప్రేమించిఉంటే, అతన్నే పెళ్లి చేసుకోవాలనుకుంటే నేనేమవుతానో నాకు తెలియదు. ఎప్పుడూ ఆలోచించలేదు. “

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS